# షావుకారు

మా వూళ్ళో అనాది నుంచీ కేసరపల్లి వారి కుటుంబాన్ని షావుకార్లు అంటూవుండేవాళ్ళు. ఇప్పటికీ ఆ బిరుదు శిలాయుగపు స్మృతి చిహ్నంగా నిలిచిపోయే ఉంది. కాని ఈ తరంలోని కేసరిపల్లి కుటుంబంలోని వారు షావుకార్లు ఏమాత్రం కాదు. చెరువు ఎండిపోయాక బయటపడ్డ చేపల్లాంటివాళ్ళే.

రెండు తరాల క్రితం కేసరిపల్లి కుటుంబయ్య అంటే దాదాపు మండలానికే షావుకారు. ఆరు వందల ఎకరాల భూమి వుండేది. ఆయన వ్యసనాలకు వినోదాలకూ హోదాకూ కీర్తి కండూతికి పెట్టే ఖర్చుకూ దానిపై వచ్చే ఆదాయం చాలక సంవత్సరానికి పది ఎకరాల చొప్పున హారతీ కర్పూరంలా కరిగి పోతూండేదిట. ఆయనకు ఒక్కడే కొడుకు. తండ్రి చనిపోయే నాటికి అతనికి సంక్రమించింది నాలుగు వందల ఎకరాల భూమి రెండు లక్షల రూపాయల అప్పు. జల్సాలో తండ్రికి మించిన కొడుకని అనిపించుకోవాలనే ఆకాంక్షతో అతను వెండి రూపాయల్ని చిల్లపెంకులా ఖర్చుబెట్టాడట. ఆ రోజుల్లో

మొరక విధుల్లో నివసించే సానులకు రేట్లు రెట్టింపు పెరిగా ఎుట అతనివల్ల, అతని హయాములో నాలుగు వందల ఎక రాలు నలభై ఎకరాలకే వచ్చింది. పై పెచ్చు ఉన్న సగం పొలాలికి సరిపడే అప్పులు. నలుగురు పిల్లలు. ఈ తరంలో వాళ్లు ఆ స్తిని, అప్పులనూ పంచుకోని — చెరువు ఎండిపోయాక చేపల పగిది బ్రతుకుతున్నారు. కాని ఆ కుటుంబానికి "షావు కార్లు" అన్న బిరుదు ఇప్పటికి మా ఊళ్ళో ఆనోటా ఆ నోటా వినబడుతూనే ఉంది.

ఆ రోజులలో కేసరిపల్లి వారు మా ఊళ్ళో ఎంత ధని కులో, దర్జాగా బ్రతికేవారో చీపురుపల్లి వారు అంత బీదవారు. నికృష్టంగా బ్రతికేవారు. రెండు తరాలవరకు చీపురుపల్లి వారి కుటుంబం కేసరిపల్లి వారి కుటుంబానికి కమతంగావుంటూ వుండేవాళ్ళు. అలాంటిది ఈతరంలో చీపురుపల్లి కుటుంబానికి చెందిన ఆదిశేషయ్యకు అదృష్టం అరచేయి చాచగా ఒక్కసారి ధనవంతుడైనాడు. అతగాడు రథశాల ప్రక్కన చిన్న కాఫీ హోటలు తెరిచి రోజుకు అయిదు పదిరూపాయల అయి వేజుతో సంసారాన్ని సాగిస్తూ వస్తున్నాడు. అలాంటిది లాట రీలో ఓ లక్షరూపాయలు వచ్చేసరికి ఒక్కసారి ధనికుడైనాడు.

లాటరీలో లక్ష రూపాయలు రావడంతో ఆది శేషయ్య హోటలు ఎత్తిపారేశాడు. తెల్లవారిపాటికి తలె త్తిన పుట్టగోడుగులా అతనిలో అహం ఒక్కసారి తలెత్తింది. కేసరి పల్లివారి కుటుంబం చప్పగా చతికిపోయింది. ఇప్పుడు వాళ్ళ

షావుకార్లు కాదు. అతి సామాన్యమైన రైతులు. ఈ ఊరి మొత్తానికి తను ధనికుడు. ఎవ్వరికీ లక్ష రూపాయల రొక్కం లేదు. కాబట్టి ఈ ఊరికి ప్రస్తుతం తనే షావుకారు. అందరు తననే షావుకారు అని పిలవాలి. ఆ బిరుదు తనకే దక్కాలి. అది సంప్రదాయానుసారంగా సంక్రమించే హక్కు కాదు అనుకున్నాడు ఆదిశేషయ్య గట్టిగా.

ఊరి నడిబొడ్డులో ఓ పాతిక సెంట్లు స్థలంకొని వెంటనే దిట్టమైన ఇల్లుకట్టాడు. ఆ ఇంటి గృహ ప్రవేశానికి ఊళ్ళో వాళ్ళ నందర్నీ పిలిచి భోజనాలుపెట్టాడు. కేసరిపల్లి వారి కుటుంబీకులు కూడా భోజనాలకు వచ్చారు.

తర్వాత కొద్ది రోజులకు ఆదిశేషయ్య మా ఊళ్ళో ఎరువుల వ్యాపారాన్ని ప్రారంభించాడు భారీఎత్తున. అన్ని రకాల ఎరువుల్నీ సరసమైన ధరలకు సరఫరా చేయసాగాడు. అది రైతులకెంతో ఉపయోగకరంగావుంది. బస్తీకి వెళ్ళి ఎరువుల్ని బళ్ళమీద తెచ్చుకోవాల్సిన అవస్థ వాళ్ళకు నిజంగా తప్పడంతో వాళ్ళంతా నిజంగా సంతోషించారు. పై పెచ్చు ఆదిశేషయ్య బీదా బిక్కీ రైతులకు అప్పులివ్వసాగాడు. వచ్చే పంటలో వాళ్ళు ఆ అప్పుల్ని తీర్చుకొనే సదవకాశాన్ని కలిగించాడు. దాంతో కొంతమంది రైతులు ఆదిశేషయ్యను దేవుడని కొనియాడసాగారు. కాని ఆ సంవత్సరం చివరకు లెక్కలు చూసుకుంటే, ఎరువుల వ్యాపారంలో పదివేలులాభం వస్తుం

దనుకుంది. అయిదు వేలు నష్టం వొచ్చింది పారుబోయిన బాకీలతో సహా.

కాని అందుకు ఆదిశేషయ్య ఏం బాధపడ లేదు. వ్యాపారమంటేనే లాభనష్టాల కలగూరగంప. కాని అతన్ని మిక్కిలిగా బాధ పెట్టిన విషయమేమిటంటే — ఊరి మొత్తానికీ మీద రైతులపట్ల దయాదృష్టిని కలిగి వున్నప్పటికీ అతన్నెవ్వరూ "షావుకారు" అని సంబోధించడం లేదు. ఆ వూరి షావుకారుగా అందరిచేత పిలిపించుకోవాలనీ, ఖ్యాతి గడించాలని అతనికి బలమైన కోర్కె వుంది కాని కేసరిపల్లి వారు షావుకార్లు కానప్పటికీ సంప్రదాయ సిద్ధంగా, ఇప్పటికీ వాళ్ళే "షావుకార్లు" గా చెలామణీ అవుతున్నారు. ఈ పరిస్థితి తొలగిపోవాలి. ఊళ్ళో అందరూ తననే షావుకారుగా పిలవాలి అన్న చింత కోర్కె తీవ్రంగా అతనిలో ప్రబలింది.

ఓ రోజు ఆదిశేషయ్య కరణంతో సంప్రదించాడు.

"కరణంగారూ" మన వూళ్ళో ఎక్కువ డబ్బు ఎవరికుంది!

"మరెవరికండీ ! తమకేగా" అన్నాడు బ్రతుకనేర్చిన కరణం తల ఆడిస్తూ.

"మరి ఆ కేసరపల్లి నారయ్యనూ, కేసరపల్లి సుబ్బయ్యనూ, కేసరపల్లి లక్ష్మీనరసయ్యను షావుకార్లని అంటారేమిటి ! వాళ్ళ ముగ్గురిదగ్గరా కలిసి నాదగ్గరున్నంత క్యాషు వుందీ !" అన్నాడు ఆదిశేషయ్య దీర్ఘంతీస్తూ.

"ఓర్నీ! ఎక్కడిదీ! నేటిబీరకాయలో 'నెయ్యి' ఏమాత్రం వుంటుందో, ఇప్పుడు వాళ్ళ "షావుకారు" బిరుదులో ఆ మాత్రం విలువవుంది. ఇప్పుడు మన వూరికి నిజంగా తమరే షావుకారు!" అన్నాడు కరణం చివరి మాటను కొంచెం వొత్తి పలుకుతూ.

ఆది శేషయ్య శరీరం ఒక్కసారి ఆనందపు వుత్సాహంతో గగుర్పొడిచింది. వెంటనే ఇంట్లోంచి కాఫీ తెప్పించి కరణాని కిప్పించాడు. అతనిలో ఆ బలహీనతను కారణం పసిగట్టాడు. మరునటి రోజు చేతులు నలువుకుంటూ అయిదు వందల రూపాయల అప్పుకొచ్చాడు.

"షావుకారుగారూ" మా అమ్మాయిని కాపురానికి పంపించాలి. ఓ అయిదు వందలు సర్దుతారా!"

"షావుకారుగారూ!" అన్న సంబోధనకు ఆది శేషయ్య శరీరం కరిగి నీరైంది. కర్పూరం ఇంట్లోకి వెళ్ళి అయిదు వచ్చనోట్లు తెచ్చియిచ్చాడు.

"షావుకారిగారి ధర్మగుణం సువర్ణాక్షరాలతో లిఖించదగింది. మరి ప్రోనోటు వ్రాసి ఇవ్వమంటారా!"

"ఇప్పటి అయిదు వందలకు ప్రోనోటు దేనికీ! తీసులు బాటున్నప్పుడు ఇచ్చుకో!" అన్నాడు ఆదిశేషయ్య నిర్లక్ష్యంగా.

కరణం మనస్సు సంతోషంతో సాగర మంతయింది. తర్వాత పదిహేను రోజులకు ఓ మూడువందలు పూట

కరణంగారూ,మునసబుగారూ, చిన్న కేశవ దేవాలయపు మేనేజింగు ట్రస్టీను, మరిఇద్దరు పెద్దమనుష్యులనూ వెంటబెట్టుకుని ధర్మ కార్యార్థమై వచ్చాడు. అంతమంది పెద్దమనుషులు తనుఇంటికి కలిసికట్టుగా రావడం ఆదిశేషయ్య కెంతో సంబరమేసింది.

షావుకారుగారూ! మేము ఒక పనిమీద తొలిగా తమ వద్దకి వచ్చాం గంపెడాశతో. చిన్న కేశవ దేవాలయ పున రుద్ధరణకు చందాలు ప్రోగుచేయాలని సంకల్పించాము. ముం దుగా,తమవద్ద శ్రీకారం చుట్టిస్తే మా పని నిర్విఘ్నంగా కొన సాగుతుంది" అన్నాడు మునసబుగారు. సంబోధనలోవున్న కిటుకును కరణంనుంచి నేర్చుకున్నాడాయన.

మునసబు అంతటివాడు తనిని "షావుకారుగారూ!" అని పిలిస్తే, ఇంకా తనకు కావాలిసిందేమి ఉందనుకున్నాడు ఆదిశేషయ్య. వెంటనే కాగితంమీద ఘనంగా వెయ్యి నూట పదహార్లు, చందా వేసి డబ్బుకూడా యిచ్చాడు.

ఆ విధంగా ఆది శేషయ్య కీర్తికోసం, తనుషావుకారుగా చెలామణి అవడంకోసం, విరివిగా ధర్మాలు చేయసాగాడు. హైస్కూలు అభివృద్ధికొరకు, ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం కొరకు, అగ్నిబాధితుల సహాయార్థం, పంటకాలువ మీద వంతెన కట్టడం కోసమూ భూరి విరాళాలిచ్చాడు.

కాని ఎన్ని విరాళాలిచ్చినా, గ్రామప్రజల మన్ననలను పొందడానికి ఎంత ప్రయత్నించినా, ఏదో కాకతాళికమైన

స్వార్థం నిమిత్తం తప్ప, అతన్ని ఉబ్బవెయ్యడానికి తప్ప సహజంగా, అందరు "షావుకారుగారు!" అనిపిలవడం లేదు. అదే తీరని బాధగావుంది ఆదిశేషయ్యకు.

ఓ సారి కేసరపల్లి నారయ్యా ఆదిశేషయ్యా మా వూళ్లో బస్సునెక్కారు బస్తీకి పోయేందుకు. బస్సునిండా జనం ఉన్నారు. కూర్చోడానికి సీటులేదు. వాళ్ళిద్దరుకూడా నిలబడ్డారు. అంతలో మా వూరు పల్లెరైతు నర్సింహులు, "షావుకారుగారూ! రండి కూర్చోండి!" అంటూ కేసరపల్లి నారయ్యకు తనులేచి సీటుయిచ్చాడు. ఆదిశేషయ్య మొహం వడదెబ్బకు మాడిపోయినట్లు మాడిపోయింది ఘోరమైన అవమానాన్ని పొందాడు.

ఇంకోసారి వూళ్ళోకి మంత్రిగారొచ్చి, తేనీటి విందుకు కేసరపల్లి లక్ష్మీనరసయ్య ఇంటికి వెళ్ళాడు - ఆదిశేషయ్య బ్రహ్మాండంగా పార్టీ ఏర్పాట్లు చేసినప్పటికీ అది అతనికి గొప్పగా అవమాన కారణమైంది!

మరోసారి బకింగ్‌హాం కెనాల్ గట్టున ఓ సాయంత్రం ఆదిశేషయ్య షికారుగా వెళ్ళివస్తూండగా ఒంటెద్దుబండి వెంకటస్వామి వచ్చిగడ్డిమోపు ఎత్తుకొస్తూ కలిశాడు.

"ఏం వెంకటస్వామీ! ఎక్కడ కోసుకొస్తున్నావ్ వచ్చిగడ్డి?" అన్నాడు ఆదిశేషయ్య లాంఛనప్రాయంగా.

"షావుకారు కేసరపల్లి సుబ్బయ్యగారి చేనులో" అన్నాడు వెంకటస్వామి గర్వంగా.

ఆదిశేషయ్య మొహం చిట్లించుకున్నాడు.

మూడు సంవత్సరాలలో చీపురుపల్లి వంశానికి చెందిన ఆదిశేషయ్య మామూలు మనిషైనాడు. కట్టిన ఇల్లు మాత్రం మిగిలింది. ఎరువుల వ్యాపారంలో బాగా నష్టం వచ్చింది. బక్క రైతులకు పెట్టిన అప్పులన్నీ పెదరావుగారి ఖాతాలో జమ పడ్డాయిగాని అతని చేతికి రాగిపైసా రాలేదు. దానాలూ ధర్మాల క్రింద, షావుకారుగా పిలిపించుకోవడానికి చేసిన ఖర్చూ అంతా పెరటి ఇనుప్పెట్టెను ఖాళీ చేశాయి. ఇప్పుడెవర్నీ ఎగతాళి పూర్వకంగాకూడా "షావుకారుగారూ!" అని పిలవడం మానివేశారు.

ఛీ ఛీ, తనెంత మోసపోయాడు! వెధవ బిరుదుకోసం వొచ్చిపడ్డ సిరినంతా తగలేశాడు కాని ప్రజలు ఆ మాత్రం సానుభూతీ, గౌరవాన్నీ చూపారా! అనుకొని పశ్చాత్తాప పడ్డాడు చీపురుపల్లి ఆదిశేషయ్య.

ఓ రోజున పెద్దబజార్లో కరణంగారు అతనికి తటస్థపడ్డాడు.

"ఆ చేబదులు ఏం చేశావ్ కరణమూ! అయిదు వందలూ తిరిగి ఇవ్వలేదేం!"

కరణం కనుబొమ్మలు ఎగుర వేశాడు.

"అది చేబదులా!" మిమ్మల్ని "షావుకారుగారూ!" అని పిలిచినందుకు మెచ్చి ఇచ్చిన బహుమానం కాదూ!"

—: * :—